క్లుప్తంగా

డీసీసీబీ మేనేజర్‌గా గోమతి



గంగాధరనెల్లూరు: జీడీనెల్లూరు డీసీసీ బ్యాంక్ మేనేజర్‌గా వి.గోమతి బాధ్యతలు స్వీకరించారు. ఈమె జిల్లా మెయిన్ బ్రాంచ్‌లో మేనేజర్‌గా విధులు నిర్వహిస్తూ బదిలీపై గంగాధరనెల్లూరు బ్యాంకుకు వచ్చారు. ఇక్కడ పని చేస్తున్న మేనేజర్ మహేష్ చిత్తూరు గాంధీ రోడ్‌లోని బ్రాంచ్‌కు బదిలీ అయ్యారు.

చలివేంద్రం ఏర్పాటు



చలివేంద్రం ప్రారంభిస్తున్న మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్

నగరి: స్థానిక మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయంలో ఎండపట్టున వచ్చేవారి కోసం చలివేంద్రం ఏర్పాటు చేశారు. ఆదివారం చలివేంద్రాన్ని మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ ప్రారంభించారు. వాహనాలకు ఎల్‌ఎల్‌ఆర్ పొందడానికి, లైసెన్సులకు టెస్ట్ డ్రైవింగ్ నిమిత్తం వచ్చేవారు ఎండపట్టున నీటి కోసం అవస్థలు పడుతుండడంతో వారి దాహార్తిని తీర్చడానికి కార్యాలయం వద్ద చలివేంద్రం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో హెడ్‌కానిస్టేబుల్ శివనారాయణరెడ్డి, సర్పంచ్ బాలప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పంచభూత మహాయాగానికి అంకురార్పణ



ఆలయంలో 31వ పంచభూత మహాయాగం

నగరి: మున్సిపల్ పరిధిలోని కేవీపీఆర్ పేట నందనార్ స్వామి ఆలయంలో ఆదివారం 31వ పంచభూత మహాయాగాన్ని ప్రారంభించారు. 30 పంచభూత యాగాలు ముగిసిన నేపథ్యంలో 31వ యాగానికి అంకురార్పణ చేశారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక హోమపూజలు నిర్వహించారు. 48 రోజుల పాటు ఈ యాగ పూజలు జరుగుతాయని యాగ నిర్వాహకులు తిరువియార్ రమేష్ స్వామి తెలిపారు. ప్రజాక్షేమం, ప్రపంచ శాంతి కోసం ఈ యాగపూజలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ పూజలకు స్థానిక భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. యాగ నిర్వాహకులు మధ్యాహ్నం భక్తులకు ఆలయ ఆవరణలో అన్నదానం చేశారు.


వైభవంగా కావమ్మ తిరునాళ్లు



ప్రత్యేక అలంకరణలో కావమ్మ, మారయ్య

పుత్తూరు: పట్టణ పరిధిలోని గోవిందపాళెం గ్రామంలో గత మూడు రోజులపాటు జరిగిన కావమ్మ, మారయ్యల తిరునాళ్లు ఆదివారం రాత్రి అగ్నిగుండ ప్రవేశంతో వైభవంగా ముగిశాయి. ఉదయం పెద్ద సంఖ్యలో మహిళలు పొంగళ్లు పెట్టి మొక్కులు తీర్చుకొన్నారు. రాత్రి కావమ్మ, మారయ్యల బుర్రకథ అనంతరం అగ్నిగుండ ప్రవేశం భక్తిశ్రద్ధలతో జరిగింది. కార్యక్రమంలో బెస్త సంఘం సభ్యులు ఉమామహేశ్వర్, మునిచంద్రయ్య, ప్రవీణ్‌కుమార్, సాయికుమార్, రమేష్, దేవేంద్ర, పార్థసారథి, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

యాదవ ఎంప్లాయిస్ సొసైటీ అధ్యక్షుడిగా గురుమూర్తి



యాదవ ఎంప్లాయిస్ సొసైటీ అధ్యక్ష, ఉపాధ్యక్షులు, నాయకులు

కార్వేటినగరం: యాదవ ఉద్యోగ సంఘం నియోజకవర్గం అధ్యక్షుడిగా గురుమూర్తి యాదవ్ ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. సోమవారం శివాలయం వీధిలో వెలసి ఉన్న శ్రీకానుగలమ్మ ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ యాదవ సమాజ అభివృద్ధికి కృషి చేస్తానని అన్నారు. ప్రతి ఒక్కరూ విద్యావంతులుగా ఎదగాలన్నారు. పదో తరగతిలో ప్రతిభ చాటిన విద్యార్థులు, ఉద్యోగాలకు సన్నద్ధమవుతున్న అభ్యర్థులకు చేయూతనందించాలని నిర్ణయించామని చెప్పారు. యాదవ ఎంప్లాయిస్ సొసైటీ మండల గౌరవ అధ్యక్షుడిగా వార్తాల మోహన్‌మురళీ యాదవ్, మండల అధ్యక్షుడిగా ఎద్దల వాసుయాదవ్, ప్రధాన కార్యదర్శిగా భీమారావుయాదవ్, ఆర్థిక కార్యదర్శిగా వేణుగోపాల్‌యాదవ్, మహిళా అధ్యక్షురాలిగా బంగారమ్మను ఎన్నుకున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మోహన్‌మురళీ యాదవ్, పాపయ్య యాదవ్, బాలాజీ యాదవ్, హరియాదవ్, సురేష్‌యాదవ్, వెంకటకృష్ణయాదవ్, గురుప్రసాద్‌యాదవ్ పాల్గొన్నారు.

నాడి పట్టే నాథుడే లేడు..

ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా అప్పట్లో వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం అడుగు వేసింది. ఎప్పటికప్పుడు వైద్య రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకువస్తూ ప్రజా మన్ననలు పొందింది. నాడు–నేడుతో ఆసుపత్రుల స్వరూపాన్ని మార్చేసింది. వైద్యశాలల్లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేసి టేలీ మెడిసిన్ సేవలను తీసుకువచ్చి ఉన్న ఊరిలోనే అత్యాధునిక వైద్య సేవలను ప్రజలకు అందించాలన్న లక్ష్యంతో ఫ్యామిలీ ఫిజీషియన్ ప్రోగ్రాంను తీసుకు వచ్చింది. దీంతో ఇళ్ల ముంగిటకే వెళ్లి వైద్యులు అత్యుత్తమ వైద్య సేవలు అందించారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వాటిని నీరుగార్చింది. దీంతో గ్రామీణ ప్రాంతాల్లోని దివ్యాంగులు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.



విజయపురం మిట్టూరులో వైద్య శిబిరం

- ఇంటి వద్దే వైద్య సేవలకు మంగళం
- పేదలపై కూటమి ప్రభుత్వం కక్ష
- దివ్యాంగులు, వృద్ధులకు తప్పని ఇబ్బందులు

విజయపురం: గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం హయాంలో పేదలకు ఇంటి వద్దకే వైద్య సేవలందించే పథకానికి కూటమి ప్రభుత్వం మంగళం పాడింది. దీంతో గ్రామీణ ప్రాంతాల్లో మంచానికే పరిమితమైన దివ్యాంగులు, వృద్ధులు వైద్య సేవల కోసం ఇబ్బందులు పడుతున్నారు. పేదలకు సంక్షేమ పథకాలతోపాటు ఉచితంగా విద్య, వైద్యం అందించగలిగితే సమాజం అభివృద్ధి చెందుతుందనే ముందు చూపుతో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన పాలనలో ఇంటింటికీ వైద్య సేవలను అందించే కార్యక్రమం నిర్వహించారు. అలాగే జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా గ్రామాల్లో ఇంటింటా వైద్య సిబ్బంది వెళ్లి పరీక్షలు నిర్వహించి, అవసరమున్న వారికి వైద్య సేవలను అందించేవారు. ప్రతి నెలా కేటాయించిన పంచాయతీలో వైద్యులు, సిబ్బంది వెళ్లి 14 రకాల వ్యాధులకు వైద్య పరీక్షలు చేసి అవసరమున్న వారిని గుర్తించి చికిత్సలు చేసి ఉచితంగా 105 రకాల మందులు అందించేవారు. ఎవరికైనా మెరుగైన వైద్య సేవలు అవసరమైతే సమీపంలో వైఎస్సార్ ఆరోగ్యశ్రీ ఆస్పత్రికి తరలించేవారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఈ సేవలకు మంగళం పాడింది. అనారోగ్య సమస్య వస్తే ఆస్పత్రులకు వెళ్లాల్సి వస్తుందని బాధితులు అంటున్నారు.

గతంలో ఇంటి వద్దే వైద్య సేవలు

గత వైఎస్సార్ సీపీ హయాంలో నెలకు ఒకసారి వైద్య సిబ్బంది ఇంటికి వచ్చి వైద్య సేవలు, పరీక్షలు చేసి ఉచితంగా మందులు ఇచ్చేవారు. జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం వృద్ధులు, దివ్యాంగులు, పేదలకు వరంగా ఉండేది. ప్రస్తుతం ఆరోగ్యం బాగా లేకపోతే ఆసుపత్రికి వెళ్లాల్సి వస్తోంది.

–నారపరాజు, పాతర్కాడు


ఉపయోగకరంగా వైద్య శిబిరాలు

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో గ్రామాల్లో ప్రజల ఇంటికి వైద్య సిబ్బంది వచ్చి వైద్య పరీక్షలు చేసి అవసరమైన వారికి ఉచితంగా మందులు ఇచ్చేవారు. అదే విధంగా కంటి చూపు లేనివారికి కంటి పరీక్షలు నిర్వహించేవారు. ప్రస్తుతం అలాంటి పరిస్థితి లేకపోవడంతో ఎవరికైనా ఆరోగ్యం బాగా లేకపోతే విజయపురం ఆస్పత్రికి వెళ్లాల్సి వస్తోంది.

–రవినాయుడు, గంగమాంబపురం

ప్రస్తుత కూటమి ప్రభుత్వం ప్రజారోగ్యానికి ప్రాధాన్యం ఇవ్వడం లేదని గ్రామీణులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

భక్తిశ్రద్ధలతో గంగమ్మకు పూజలు



విశేషాలంకరణలో గంగమ్మ తల్లి

గంగాధరనెల్లూరు: మండలంలోని అంబోదరపల్లి పంచాయతీ శెట్టి రామాపురం గ్రామంలో గంగమ్మకు భక్తిశ్రద్ధలతో గ్రామస్తులు పూజలు నిర్వహించారు. బెంగళూరులో నివశిస్తున్న శెట్టి రామాపురానికి చెందిన గ్రామస్తులు, వారి బంధువులు ప్రతి సంవత్సరం అంగరంగ వైభవంగా గంగమ్మకు పూజలు చేయడం ఆనవాయితీ. అమ్మవారికి ప్రత్యేక పుష్పాలంకరణతో ప్రత్యేక పూజలు నిర్వహించి, నైవేద్యం సమర్పించారు. అనంతరం విచ్చేసిన భక్తులందరికీ ప్రత్యేక విందు కార్యక్రమం నిర్వహించారు.

దేశమ్మ ఆలయ ఈఓగా వెంకటేశులు



నగరి: నేత్ర ప్రదాయిని దేశమ్మ దేవత ఆలయ ఈఓగా వెంకటేశులు ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఈఓగా బాధ్యతలు నిర్వర్తించిన లత ఆయనకు బాధ్యతలను అప్పగించారు. వెంకటేశులు తిరుపతి, శ్రీబుగ్గమఠం నుంచి బదిలీపై నగరి దేశమ్మ దేవాలయానికి విచ్చేశారు. ఆలయానికి సబంధించిన పనులను త్వరితగతిన చేపడుతానని ఈ సందర్భంగా ఆయన తెలిపారు.

మాజీ డిప్యూటీ సీఎంకు ఘన సత్కారం



హేమసుందర్‌రెడ్డిని ఆశీర్వదిస్తున్న మాజీ మంత్రి నారాయణస్వామి

వెదురుకుప్పం: మండలంలోని గంటావారిపల్లె గ్రామంలో మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామిని వైఎస్సార్ సీపీ వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షుడు బండి హేమసుందర్‌రెడ్డి, ఎంపీపీ నాగరాణి ఘనంగా సత్కరించారు. ఎంపీపీ భర్త బండి హేమసుందర్‌రెడ్డి పుట్టిన రోజు సందర్భంగా ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఆదివారం గ్రామంలో పర్యటించిన మాజీ మంత్రి నారాయణస్వామి కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలియజేశారు. హేమసుందర్‌రెడ్డిని ఆశీర్వదించి అందరికీ తన వంతు సహాయసహకారాలు అందించాలని ఆకాంక్షించారు. పలువురు నేతలు బండి హేమసుందర్‌రెడ్డిని సన్మానిస్తూ అభినందించారు.

కొల్లాపురమ్మ సేవలో మాజీ మంత్రి



పూజలు చేస్తున్న మాజీ మంత్రి ఆర్కే రోజా



మాజీ మంత్రిని ఆహ్వానిస్తున్న నాయకులు

నిండ్ర: మండల కేంద్రమైన నిండ్ర గ్రామంలోని కొల్లాపురమ్మ ఆలయంలో ఆదివారం తిరునాళ్లు ఘనంగా నిర్వహించారు. మాజీ మంత్రి ఆర్కే రోజా ఆలయంలో అమ్మవారిని దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం అమ్మవారికి గ్రామస్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి గెరిగెను గ్రామంలో ఊరేగించారు. సాయంత్రం అమ్మవారిని ప్రత్యేకపూలతో అలంకరించి గ్రామంలో ఊరేగించారు. ఎంపీపీ దీప, వైఎస్సార్ సీపీ ఎస్సీసెల్ రాష్ట్ర కార్యదర్శి శ్యామ్‌లాల్, వైస్ ఎంపీపీ శుభ, సర్పంచ్ వసంతమ్మ, జెడ్పీటీసీ సభ్యుడు పరంధామ, నాయకులు వేణురాజు, బాబురెడ్డి, శివయ్య, గోపి, మునిరాజ్, మునికృష్ణారెడ్డి, వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

వడమాలపేట జాతరకు ఆహ్వానం

వడమాలపేట (విజయపురం): ఈ నెల 21వ తేదీన మండలంలో నిర్వహించే గంగమ్మ జాతరకు మాజీ మంత్రి ఆర్కే రోజాకు వైఎస్సార్ సీపీ నాయకులు ఆదివారం ఆహ్వానం పలికారు. ఈ సందర్భంగా ఆమె నివాసంలో మర్యాద పూర్వకంగా కలిసి, పూలమాలలు, దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు సుబ్రమణ్యంరెడ్డి, రాజారెడ్డి, చంద్రారెడ్డి, వేణు, భారత్‌కుమార్, ఉదయ్, చంద్రా, హరీష్ తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ఆత్మీయ సమావేశంలో పూర్వ విద్యార్థులు

వడమాలపేట(విజయపురం): వడమాలపేట ఉన్నత పాఠశాలలో 2008–2009 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. పదహారేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా అంతా ఒక చోట కలిసి ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. అనంతరం పాఠశాల ప్రాంగణంలో చెట్లు నాటే కార్యక్రమం నిర్వహించారు.

నేడు ధ్వజారోహణం

శ్రీరంగరాజపురం: మండలంలోని తయ్యూరు పాయికట్టు అంకనపల్లి గ్రామం వద్ద వెలసిన శ్రీద్రౌపదీ సమేత ధర్మరాజుల స్వామివారి దేవాలయం వార్షిక మహాభారత యజ్ఞంలో భాగంగా సోమవారం ఉదయం ధ్వజారోహణం నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్త లింగారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆలయ ధర్మకర్త లింగారెడ్డి మాట్లాడుతూ సోమవారం నుంచి జూన్ నెల 1వ తేదీ వరకు మహాభారత యజ్ఞం నిర్వహిస్తామన్నారు. ప్రతి రోజు భాగవతారిణి ఎం.పూర్ణ ఆధ్వర్యంలో హరికథా గానం, వీధి నాటకం, పాయికట్టు ఉభయదారులు అన్నదానం నిర్వహిస్తారన్నారు. తయ్యూరు పాయికట్టు ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులై తీర్థ ప్రసాదాలను స్వీకరించి, యజ్ఞాన్ని విజయవంతం చేయాలని కోరారు.

ఎన్టీఆర్ అభిమానుల రక్తదానం



సర్టిఫికెట్లు అందుకొంటున్న యువత

పుత్తూరు: సినీ హీరో జూనియర్ ఎన్టీఆర్ 42వ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం ఆయన అభిమానులు రక్తదానం చేశారు. రక్తదానం చేసిన యువకులకు ఎన్టీఆర్ ట్రస్ట్ ద్వారా సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో పద్మనాభం, కృష్ణ, అభి, మణి, కౌశిక్, ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఎయిడ్స్ స్మారక దినోత్సవం



ర్యాలీని ప్రారంభిస్తున్న డాక్టర్ సుజాత

పుత్తూరు: అంతర్జాతీయ ఎయిడ్స్ స్మారక దినోత్సవం అంటే కేవలం స్మరణ మాత్రమే కాదని బాధితులపై ఉన్న బాధ్యతను గుర్తు చేసుకొనే రోజు అని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి ట్రైనీ డాక్టర్ సుజాత తెలిపారు. ఆదివారం ఆసుపత్రిలో అంతర్జాతీయ కొవ్వొత్తులతో ఎయిడ్స్ స్మారక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. డాక్టర్ మాట్లాడుతూ ఎయిడ్స్ ఎలా వ్యాపిస్తుంది, దాని నివారణ మార్గాలను ప్రజలకు విస్తృతంగా తెలియజేయాల్సిన బాధ్యత వైద్య సిబ్బందిపై ఉందన్నారు. ప్రతి ఒక్కరూ ఎయిడ్స్‌పై అవగాహన కలిగి ఉండాలన్నారు. అనంతరం వైద్య సిబ్బంది పట్టణంలో అవగాహనా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఐసీటీసీ సిబ్బంది చెంచమ్మ, సోమశేఖర్, ఆరుముగం, భవనేశ్వరి, అరుణలత, అరుల్ పాల్గొన్నారు.

తొట్టెలున్నా.. తాగునీరు లేదు



క్రిష్ణజమ్మపురం బస్‌స్టేషన్ సమీపంలో నిరుపయోగంగా ఉన్న నీటి తొట్టె



నీటి తొట్టెకు ఆర్భాటంగా భూమిపూజ చేస్తున్న టీడీపీ నాయకులు(ఫైల్)

పాలసముద్రం: మండలంలో ఉపాధిహామీ పథకం ద్వారా వేసవిలో మూగజీవాలు దాహార్తి తీర్చేందుకు నిర్మించిన నీటి తొట్టెలకు పైప్‌లైన్ లేకపోవడంతో తాగునీరు అందడం లేదు. కూటమి నాయకులు ఎంతో ఆర్భాటంగా సర్పంచుల అనుమతి లేకుండానే భూమి పూజలు చేశారు. అయితే వేసవికాలం పోతున్నా మండలంలో తొట్టెల్లో నీరు లేక మూగజీవాలు విలవిల్లాడుతున్నాయి. శ్రీకావేరిరాజుపురం పంచాయతీలో పశువులు, మేకలు, గొర్రెల దాహార్తి తీర్చేందుకు నీటి తొట్టెలకు భూమి పూజలు మాత్రమే చేశారు. ఒక్క తొట్టె కూడా నిర్మించలేదు. మండలంలో ఉపాధిహామీ పథకంలో 49 నీటి తొట్టెలు నిర్మించాలని లక్ష్యం ఉండగా అందులో 33 తొట్టెలకు రూ.30 చొప్పున నిధు మంజూరయ్యాయి. అందులో 20 తొట్టెలు మాత్రం కూటమి నాయకులకు అనుకూలంగా ఉన్న చోటనే నిర్మించాలని పూర్తి బిల్లులు అందుకున్నారు. అయితే బిల్లులు తీసుకున్న తరువాత 10 తొట్టెలు మాత్రమే పూర్తయ్యాయి. అయితే వాటిని నీటితో నింపడం లేదు. ఉపాధి హామీ అధికారులు కూడా తొట్టెలకు నీటి సరఫరా ఉందో లేదోనని పరిశీలన చేయకుండానే నాయకుల ఒత్తిడితో బిల్లులు పెట్టారు. సంబంధిత అధికారులు స్పందించి నీటి తొట్టెలకు పైప్‌లైన్ వేసి నీరు పెట్టాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

ఆకట్టుకున్న దుర్యోధన వధ



దుర్యోధనుడిని వధిస్తున్న భీమసేనుడు

పాలసముద్రం: వనదుర్గాపురం సమీపంలోని అత్తిమాంజేరి గ్రామంలో వెలసిన ధర్మరాజుల స్వామి మహాభారత ఉత్సవాల్లో భాగంగా ఆదివారం జరిగిన గదాయుద్ధం, దుర్యోధనవధ ఘట్టాలు రసవత్తరంగా సాగాయి. వెంకటేశ్వర నాట్య బృందంలో భీమసేనుడిగా నాగరాజు, దుర్యోధనుడిగా మునిరత్నం వేషధారులతో కురుక్షేత్ర యుద్ధం ముగింపులో దుర్యోధన వధ సన్నివేశం ఆద్యంతం ప్రజలను ఆకట్టుకుంది. ఈ సన్నివేశాన్ని తిలకించడానికి మండల పరిధిలోని, తమిళనాడు రాష్ట్ర ప్రజలు వందలాదిగా తరలివచ్చారు. ఈ ఉత్సవాలకు వచ్చిన భక్తులకు అన్నదాన కార్యక్రమం చేపట్టారు. రాత్రి స్వామివారి ఊరేగింపు, పచ్చిగెరిగ అగ్నిగుండ మహోత్సవం బాణ సంచా వేడుకలు ఘనంగా జరిగాయి.

నిండ్ర: మండలంలోని అత్తూరు గ్రామంలో ఆదివారం ద్రౌపది దేవి తిరునాళ్లలో భాగంగా దుర్యోధన వధ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం అమ్మవారి ఊరేగింపు ఘనంగా చేపట్టారు. ఉదయం గ్రామస్తులు అమ్మవారి ఆలయం వద్ద పొంగళ్లు పెట్టారు. అమ్మవారికి అభిషేకాలు, అర్చనలు చేశారు. సాయంత్రం అగ్నిగుండం ప్రవేశం నిర్వహించారు. అమ్మవారి విగ్రహాన్ని ప్రత్యేక పూలతో అలంకరించారు. గ్రామస్తులు, యువకులు పాల్గొన్నారు.



అత్తూరులో దుర్యోధన వధ

వేణుగోపాలుని బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ





వేణుగోపాల స్వామి ఆలయంలో మేదిని దేవికి పూజలు, ఊరేగింపుగా ధ్వజారోహణ సామగ్రిని తీసుకొస్తున్న సుబ్రమణ్యయాదవ్, కుటుంబ సభ్యులు

కార్వేటినగరం: శ్రీవేణుగోపాల స్వామివారి బ్రహ్మోత్సవాలకు ఆదివారం రాత్రి శాస్త్రోక్తంగా అంకురార్పణ కార్యక్రమం నిర్వహించారు. ఉదయం సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపి పరివార దేవతలకు తిరుమంజనం నిర్వహించారు. ఉత్సవమూర్తులకు అభిషేకం, తోమాలసేవ, సహస్రనామార్చన చేశారు. సాయంత్రం 5 నుంచి 8 గంటల వరకు వేద ప్రబంధ శాత్తుమొర నిర్వహించారు. సేనాపతి ఉత్సవం చేపట్టారు. అనంతరం రాత్రి 7.15 నుంచి 8.30 గంటల వరకు మృత్సంగ్రహణం, మేదిని పూజ, శాస్త్రోక్తంగా అంకురార్పణతో సకల దేవతలకు ఆహ్వానం పలికారు. టీటీడీ ఆలయ అధికారి సురేష్‌కుమార్, షరాబు బాబుసురేష్, ఆలయ అర్చకులు, అధికారులు పాల్గొన్నారు.

స్వామివారికి సారె

కార్వేటినగరం శ్రీవేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా ముందు అత్యంత పవిత్రంగా నిర్వహించే ధ్వజారోహణ కార్యక్రమానికి కావాల్సిన గరుడ పతాకం, కొడితాడు, గరుడ పటానికి కావాల్సిన వస్త్రాలు తదితర పూజా సామగ్రిని స్థానికులు సుబ్రమణ్యయాదవ్ ఆనవాయితీ ప్రకారం మేళతాళాల నడుమ, అత్యంత వైభవంగా ఊరేగింపుగా తీసుకొచ్చారు. ఆలయ అధికారికి సమర్పించారు. అనంతరం స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

నేడు ధ్వజారోహణం

కార్వేటినగరంలో వెలసి ఉన్న శ్రీవేణుగోపాల స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం ఉదయం 9.15 నుంచి 9.45 గంటల మధ్య మిథున లగ్నంలో నిర్వహించే ధ్వజారోహణంతో బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి. సాయంత్రం 5 నుంచి 6 గంటల వరకు రుక్మిణీ, సత్యభామ సమేత శ్రీవేణుగోపాలునికి ఊంజల్ సేవ ఉంటుంది. రాత్రి 7 గంటల నుంచి 9 గంటల వరకు పెద్ద శేష వాహనంపై స్వామివారు నగర వీధుల్లో విహరించనున్నారు.



తిరుమాడ వీధుల్లో సేనాధిపతి ఊరేగింపు

వైఎస్సార్ సీపీ కార్యకర్తకు ఘన నివాళి



నివాళులర్పిస్తున్న రామ్‌ప్రసాద్ రెడ్డి

నగరి: మండలంలోని నాగరాజుకుప్పం గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ కార్యకర్త ఆదెమ్మ శనివారం రాత్రి ఆకస్మికంగా మృతిచెందారు. ఆదివారం ఆమె స్వగృహానికి వెళ్లిన మాజీ మంత్రి ఆర్కేరోజా సోదరుడు రామ్‌ప్రసాద్ రెడ్డి ఆదెమ్మ మృతదేహంపై పుష్పగుచ్ఛం ఉంచి నివాళులర్పించారు. ఆయన వెంట ఎంపీపీ భార్గవి, నాయకులు ఏలుమలైరెడ్డి, బుజ్జిరెడ్డి, వైస్‌ఎంపీపీ కన్నియప్ప, చంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.